ఏసు చూపిన మార్గంలో నడుద్దాం

- భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే
- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు
- శిలువను మోసి భక్తి చాటుకున్న క్రైస్తవులు

కోడుమూరు రూరల్ : మానవులంతా ఒక్కటే.. ఏసు చూపిన మార్గంలో మనుషులంతా నడిచి మంచిని పెంచాలని, ఆపదలో ఉన్న తోటివారిని ఆదుకుని సాయం చేయాలని రెవరెండ్ ఆర్.సామెల్ సూచించారు. శుక్రవారం మండలంలోని వర్కూరు, పులకుర్తి, కల్లపరి, లద్దగిరి, గోరంట్ల, ప్యాలకుర్తి, అమడగుంట్ల తదితర గ్రామాల్లోని చర్చిల్లో క్రైస్తవులు గుడ్ ఫ్రైడే వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కోడుమూరులోని ఏబీఎం చర్చిలో క్రైస్తవ సోదరులంతా ప్రత్యేక ప్రార్థనలు చేసి యేసు ప్రభువును కీర్తించగా, రెవరెండ్ ఆర్.సామెల్ గుడ్ ఫ్రైడే వేడుకల ప్రాముఖ్యతను వివరించారు.

ఏసుప్రభు లోక రక్షకుడు

సి.బెళగల్: ఏసుప్రభు లోక రక్షకుడిగా, ప్రజల కాపరిగా ఎల్లవేళలా జనులందరికీ సేవకుడిగా ఉంటాడని సి.బెళగల్ ఏబీఎం చర్చి పాస్టర్ చంద్రశేఖర్ అన్నారు. స్థానిక చర్చిలో గుడ్ ఫ్రైడే ప్రార్థనలు నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనలలో పాస్టర్ బైబిల్ సారంపై వినిపించారు. ఏసు నేడు పరలోకానికి చేరుకుని మూడు రోజులుగా సమాధి అనంతరం, ఈస్టర్ రోజు (ఆదివారం) తిరిగి సజీవుడు అవుతాడని, సందర్భంగా ఈస్టర్‌ను జరుపుకోవటం ఆనవాయితీ అని భక్తులకు వివరించారు. అలాగే మండలం పరిధిలోని పోలకల్, ఇనగండ్ల, కంబదహాల్, ముడుమాల, కొత్తకోట, బురాన్‌దొడ్డి, కొండాపురం గ్రామాలలోని క్రైస్తవ మందిరాలలో భక్తులకు పాస్టర్లు దైవసందేశాన్ని వినిపించారు.


కోడుమూరు ఏబీఎం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న మహిళలు


కోడుమూరులో ఏసు సందేశాన్ని వినిపిస్తున్న రెవరెండ్ ఆర్.సామెల్

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే

ఓర్వకల్లు : మండలంలోని వివిధ గ్రామాలలో గుడ్ ఫ్రైడేను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండలంలోని ఓర్వకల్లు, హుసేనాపురం, లొద్దిపల్లె, శకునాల, ఉయ్యాలవాడ, మీదివేముల, బ్రాహ్మణపల్లె, తిప్పాయపల్లె గ్రామాలలో వెలసిన ఆర్‌సీఎం, సీఎస్ఐ, ఏబీఎం, సెవెన్త్‌డే ప్రార్థనామందిరాలలో క్రైస్తవులు ఏసుక్రీస్తు శిలువపై పలికిన మాటాలను స్మరించుకున్నారు. ఓర్వకల్లు ఆర్‌సీఎం విచారణ గురువులు రెవ.ఫాదర్ ఆనందరాజు, సంఘపెద్దల ఆధ్వర్యంలో స్థానిక పాత చర్చి నుంచి కొత్త చర్చివరకు శిలువ యాత్రను నిర్వహించారు. మోకాళ్లపై మోకరిల్లి ఉపవాస ప్రార్థనలు చేశారు.

పాణ్యం : మండలంలో గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా జరిగాయి. నెరవాడ మెట్ట వద్ద ఉన్న యేసయ్య స్వస్థత శాల ప్రార్థన మందిరంలో పాస్టర్ కొప్పెర సునీల్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. దేవుడు సూచించిన మార్గాలను అనుసరించాలని, ఇతరుల పట్ల సహాయసహకారాలు అందించాలని కోరారు. పాణ్యంలోని షాలేము ప్రార్థన మందిరంలో పాస్టర్ మోజేష్‌లో ఆధ్వర్యంలో ప్రార్థనలు జరిగాయి.

క్రీస్తు మార్గం అనుసరణీయం

కల్లూరు: క్రీస్తుమార్గం అనుసరణీయమని చర్చి పాస్టర్లు అన్నారు. కల్లూరు గ్రామీణ, అర్బన్ ప్రాంతాల్లోని చర్చిల్లో భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఏసు క్రీస్తు శిలువపై పలికిన ఏడు మాటలను దైవ సేవకులు వివరించారు. ఆయా చర్చిల్లో ప్రార్థనల అనంతరం సంఘ సభ్యులు పండ్లు, చల్లని పానీయాలు, ఆహారం అందజేశారు.


సి.బెళగల్‌లో వాక్యోపదేశం చేస్తున్న ఏబీఎం చర్చి పాస్టర్ చంద్రశేఖర్

త్యాగానికి ప్రతీక గుడ్‌ఫ్రైడే

గడివేముల: యేసుక్రీస్తు శిలువ వేయబడిన ఘటనకు గుర్తుగా మండలంలోని అన్ని గ్రామాల్లో క్రైస్తవులు గుడ్‌ఫ్రైడే వేడుకలను జరుపుకున్నారు. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గడివేములలోని ఏబీఎం చర్చి ఆవరణలో పాస్టర్ జాష్వ, సంఘ సెక్రటరీ మంద బాలస్వామి, సంఘ ట్రెజరర్ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. అలాగే మండలంలోని పెసరవాయి, మంచాలకట్ట, కరిమద్దెల, బూజునూరు, చిందుకూరు, గడివేముల సీఎస్ఐ చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.


ఓర్వకల్లులో ప్రసంగిస్తున్న రెవ.ఫాదర్ ఆనందరాజు


పాణ్యంలో ప్రసిగిస్తున్న పాస్టర్ సునీల్


గడివేముల ఏబీఎం చర్చిలో గుడ్‌ఫ్రైడే సందేశాన్ని వినిపిస్తున్న పాస్టర్


గడివేముల ఏబీఎం చర్చి ప్రార్థనల్లో పాల్గొన్న మహిళలు

క్లుప్తంగా

అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి


అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

కోడుమూరు రూరల్ : అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని, ప్రమాదాలు చోటు చేసుకున్న సమయంలో జాగ్రత్తలు తీసుకోవడం వల్ల ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చని కోడుమూరు అగ్నిమాపక కేంద్రం ఎస్ఐ మహబూబ్ దౌలత్ తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం అగ్ని ప్రమాదాలు చోటు చేసుకున్న సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ కోడుమూరు ప్రభుత్వాసుపత్రి వద్ద ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

విరిగిన మంచినీటి పైపు లైన్


పెసరవాయి మెయిన్ రస్తాలో విరిగిన మంచినీటి పైపులైన్

గడివేముల: మండల పరిధిలోని పెసరవాయి మెయిన్ రస్తాలో మంచినీటి పైపులైన్ విరిగిపోయింది. దీంతో బస్టాండ్ ప్రాంతంలో నీటి సరఫరా నిలిచిపోయి ఆ ప్రాంతవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని స్థానిక పంచాయతీ అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మంచినీటి పైపులైన్‌ను మరమ్మతులు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

దుకాణాల తొలగింపు


దుకాణాలు తొలగిస్తున్న హైవే అధికారులు

పాణ్యం: హైవే పరిధిలో పాణ్యం ఫ్లైఓవర్ బ్రిడ్జికి అటు ఇటు అక్రమంగా వెలసిన దుకాణాలను శుక్రవారం తొలగించారు. దుకాణాదారులు పలు మార్లు నోటీసులిచ్చినా స్పందించకపోవడంతో పోలీసుల సాయంతో అధికారులు క్రేన్‌తో వాటిని తొలగించారు. సర్వీస్ రోడ్డులో కూడా దుకాణాలు ఏర్పాటు చేయరాదని హెచ్చరించారు.

వధూవరులను ఆశీర్వదించిన కాటసాని


వధూవరులతో కాటసాని రాంభూపాల్ రెడ్డి

గడివేముల: మండలం ఎంపీపీ నాగమద్దమ్మ కుమారుడి రమేష్ వివాహానికి నంద్యాల జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి శుక్రవారం హాజరయ్యారు. గని గ్రామంలో జరిగిన వివాహానికి నూతన వధూవరులు రమేష్, అశ్వనీలను ఆశీర్వదించారు. కాటసాని రాంభూపాల్ రెడ్డి వెంట జెడ్పీటీసీ సభ్యుడు ఆర్ బీ చంద్రశేఖర్ రెడ్డి, పాణ్యం మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సూర్యనారాయణ రెడ్డి, ఎంపీటీసీ మహేష్ రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు ఆనంద్ రెడ్డి, అనిల్ కుమార్ రెడ్డి, మేఘనాథ రెడ్డి, నంద్యాల వెంకటేశ్వర్లు, చంద్రమౌళీశ్వర్ రెడ్డి, రవీంద్రారెడ్డి, పరమేశ్వర్ రెడ్డి, రమేష్, గని ప్రతాపరెడ్డి, రాము తదితరులు పాల్గొన్నారు.

నేడు వీహెచ్‌పీ ధర్నా

కర్నూలు కల్చరల్: పశ్చిమ బెంగాల్లో హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్ సమీపంలోని గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి ఈపూరి నాగరాజు పేర్కొన్నారు. వీహెచ్‌పీ, బజరంగ్ దల్ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, హిందువులు అందరూ తరలి రావాలని కోరారు.

ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి

కర్నూలు(సెంట్రల్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం ఏపీ వేర్‌హౌస్ హమాలీ యూనియన్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని కార్మిక, కర్షక భవన్‌లో నిర్వహించారు. వేర్ హౌస్ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, ఉద్యోగ భద్రత కోసం పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయాన్ని కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్.నరసింహులు, విష్ణుమూర్తి పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో దుర్గా పూజ


దుర్గా పూజల్లో భక్తులు

కర్నూలు కల్చరల్: స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయంలో శుక్రవారం మహా గౌరీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాహుకాల, దుర్గా పూజ, లలితా సహస్రనామ పారాయణం తదితర పూజలు భక్తి శ్రద్ధలతో జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.ఆలయం ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

20న ఉగాది పురస్కార గ్రహీతలకు సన్మానం

కర్నూలు కల్చరల్: సాహితీ సదస్సు ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీ ఉదయం 10 గంటలకు మద్దూరు నగర్‌లోని పింగళి సూరన తెలుగు తోటలో ఉగాది పురస్కార గ్రహీతలకు సన్మానం ఏర్పాటు చేసినట్లు సాహితీ సదస్సు అధ్యక్షులు చంద్రశేఖర కల్కూర తెలిపారు. దీంతో పాటు ఆచార్య ఎస్వీ కృష్ణమూర్తిచే స్మారకోపన్యాసం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. విద్వాన్ షేక్ దావూద్ రచించిన «దాసి పన్నా» పై సాహితీ వేత్త జీఎస్ఆర్కే శర్మ ఉపన్యసిస్తారని తెలిపారు. క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు, అఖిల భారతీయ బ్రాహ్మణ కరివేన నిత్యాన్నదాన సత్రం కార్యదర్శి డాక్టర్ వేణుగోపాల్ అతిథులుగా హాజరు కానున్నట్లు తెలిపారు.

వక్ఫ్ సవరణ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలి


గూడూరులో వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

కోడుమూరు రూరల్: కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ సవరణ చట్టాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని గూడూరు మున్సిపల్ వైస్ చైర్మన్ పీఎస్ అస్లామ్ డిమాండ్ చేశారు. శుక్రవారం గూడూరులో ముస్లిం భారీ ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దేశంలోని ముస్లిం మైనార్టీలకు వ్యతరేకంగా చట్టాలను చేస్తూ దాడులకు పాల్పడుతోందని ఆరోపించారు. ముస్లింల అభివృద్ధి కొరకు దానంగా ఇచ్చిన ఆస్తులను దోచుకునేందుకే బీజేపీ ప్రభుత్వం వక్ఫ్ సవరణ చట్టాన్ని తెచ్చిందని ఆరోపించారు. వక్ఫ్ సవరణ బిల్లుకు మద్దతు తెలిపిన సీఎం, చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఖలీల్‌బాషా, కోఆప్షన్ సభ్యులు మదర్‌బాషా, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి సుభాకర్, సీపీఐ, సీపీఎం నాయకులు రంగన్న, మోహన్, అవాజ్ కమిటీ, ముస్లిం మైనార్టీ సంఘాల పెద్దలు అబ్దుల్ ఖాద్రి, ఖాజా హుసేన్, నూరుల్లా, అబ్దుల్లా, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏఐబీఈఏ వ్యవస్థాపక దినోత్సవం

కర్నూలు(అగ్రికల్చర్): బ్యాంకింగ్ రంగంలో అతి పెద్ద ట్రేడ్ యూనియన్ ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐబీఈఏ) 80వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. కర్నూలు క్లబ్‌లో బ్యాంకు ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు వివిధ ఆటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఏఐబీఈఏ జిల్లా మొదటి సెక్రటరీ మక్బుల్, విజయ బ్యాంకు పూర్వపు అధ్యక్షుడు ఈశ్వరప్ప ప్రారంభించారు. మహిళ ఉద్యోగులు ఉత్సాహంగా ఆటల పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏఐబీఈఏ కర్నూలు శాఖ చైర్మన్ నాగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి శివకృష్ణ, ఇతర నాయకులు అజయ్, వాసుదేవ రెడ్డి, మహిళ నాయకురాలు పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ఈ- వ్యర్థాల వినియోగమే మానవాళికి రక్ష


మాట్లాడుతున్న కమిషనర్ ఎస్. రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): సమాజంలో పర్యావరణానికి ఈ - వ్యర్థాలు తీవ్ర హాని చేస్తున్నాయని, వాటిని పునర్వినియోగించడమే మానవాళి మనుగడకు రక్ష అని నగరపాలక సంస్థ కమిషనర్ రవీంద్రబాబు అన్నారు. శుక్రవారం స్థానిక పొట్టి శ్రీరాములు చిల్డ్రన్స్ పార్కులో పారిశుద్ధ్య విభాగం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రోజురోజుకు సమాజంలో పెరిగిపోతున్న ఎలక్ట్రానిక్ ఉపకరణాల వ్యర్థాలను పూర్తి స్థాయిలో పునఃశుద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. నగరంలోని అన్ని వార్డుల్లో ఈ-వ్యర్థాల కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతయ ఈఈ కిషోర్ రెడ్డి, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, గ్రీన్ కో గ్లోబల్ రీసైక్లింగ్ ప్రతినిధులు పవన్, అలోక్, శానిటరీ సూపర్ వైజర్ నాగరాజు పాల్గొన్నారు.

ప్రాంతీయ కంటి ఆసుపత్రి సందర్శన

కర్నూలు(హాస్పిటల్): కర్నూలులోని ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆసుపత్రిని శుక్రవారం ఎల్‌వీ ప్రసాద్ ఐ హాస్పిటల్ వైద్యబృందం పరిశీలించింది. ప్రస్తుతం ఇక్కడ సేకరిస్తున్న నేత్రాలను ఎల్‌వీ ప్రసాద్ ఐ హాస్పిటల్‌లో కార్నియా మార్పిడి చేసి ఇతరులకు చూపు ప్రసాదిస్తున్నారు. ఇకపై కర్నూలులోనే కార్నియా మార్పిడి ఆపరేషన్ చేసేందుకు అవసరమైన ఏర్పాట్ల గురించి వైద్యబృందం పర్యటించింది. ఇందులో భాగంగా ఆపరేషన్ థియేటర్, వార్డులు, వైద్యపరికరాలు, ఐ.బ్యాంకును పరిశీలించింది. కార్నియా మార్పిడి చేసేందుకు అవసరమైన అన్ని వసతులు ఉన్నాయని సంతృప్తి వ్యక్తం చేసిన బృందం ఐ బ్యాంకు నిర్వహణపై పెదవి విరిచింది. అక్కడ కనీసం ఫ్యాను కూడా లేదని ఆవేదన వ్యక్తం చేసింది. వెంటనే తగిన ఏర్పాట్లు చేయాలని సూచించింది. బృందంలో ఎల్వీ ప్రసాద్ ఐ హాస్పిటల్ చైర్‌పర్సన్ డాక్టర్ హరేల్, డాక్టర్ దివ్య ఉన్నారు. వారి వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి. వెంకటేశ్వర్లు, డాక్టర్ సత్యనారాయణరెడ్డి, డాక్టర్ యుగంధర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.


కంటి ఆసుపత్రిని పరిశీలిస్తున్న ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంకు వైద్యబృందం

సీనియర్ సిటిజన్ కార్డులు వినియోగించుకోండి

కర్నూలు (టౌన్) : నగరపరిధిలో నివసించే వయోవృద్ధులు సీనియర్ సిటిజన్ కార్డులు తీసుకోవాలని నగరపాలక అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 60 ఏళ్లు పైబడిన పురుషులు, 50 ఏళ్లు పైబడిన మహిళలు సీనియర్ సిటిజన్స్‌గా పరిగణించబడతారన్నారు. నగరపాలక సంస్థ పరిధిలోని సచివాలయాల్లో ఈ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆధార్ కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటో రూ. 40 రుసుం చెల్లిస్తే మంజూరు చేస్తారని తెలిపారు. సీనియర్ సిటిజన్ కార్డుల ద్వారా రవాణా సమయంలో వివిధ సందర్భాల్లో క్యూలైన్‌లు, ఇతరాత్ర సమయాల్లో ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

మానవతా వాది తుమ్మల


తుమ్మల చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న సాహితీ వేత్తలు

కర్నూలు కల్చరల్: అనేక మంది రచయితలను తీర్చిదిద్దిన ఘనత తుమ్మల రామకృష్ణదేనని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. కర్నూలు కథా సమయం ఆధ్వర్యంలో సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో శుక్రవారం దివంగత ప్రముఖ రచయిత, ద్రవిడ యూనివర్సిటీ పూర్వపు వైస్ చాన్సలర్ తుమ్మల రామకృష్ణ సంస్మరణ సభ జరిగింది. పలువురు సాహితీ వేత్తలు, రచయితలు, కవులు తుమ్మల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. గాడిచర్ల ఫౌండేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర కల్కూర, తుమ్మల రామకృష్ణ సోదరులు డాక్టర్ తుమ్మల శ్రీనివాస్, కథా రచయిత ఉమామహేశ్వర్, తెలకపల్లి మధుసూదన శర్మ, వెంకట కృష్ణ, జంధ్యాల రఘుబాబు, నంది అవార్డు గ్రహీత పత్తి ఓబులయ్య, కల్యాణదుర్గం స్వర్ణలత తదితరులు మాట్లాడారు. అధ్యాపకునిగా, ప్రొఫెసర్‌గా అనేమంది విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తును కల్పించారన్నారు. అనేక సేవా కార్యక్రమాలు చేయించిన మానవతా వాది అన్నారు. రచయిత డాక్టర్ హరికిషన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎస్‌డీవీ అజీజ్, మారుతి, చంద్రమౌళిని, వెంకటేశ్వరరెడ్డి, రత్నం యేసేపు, నవీన్ పాటి, వీపూరి వెంకటేశ్వర్లు, ఎంపీ బసవరాజు, మహమ్మద్ మియ్యా, కథా సమయం కార్యవర్గ సభ్యులు తుమ్మల శిష్యులు పాల్గొన్నారు.

రోడ్డుపైనే మురుగు

కల్లూరు: గ్రామాల్లో పరిశుభ్రత పడకేసింది. పారిశుద్ధ్య పనులు సక్రమంగా జరగడం లేదు. మండలంలో 24 గ్రామాలు ఉన్నాయి. కొన్ని గ్రామాల్లో చెతా చెద్దారాన్ని చెత్త సంపద తయారీ కేంద్రాలకు(ఎస్‌డబ్ల్యూపీసీ)లకు తీసుకెళ్లకుండా ఎక్కడ పడితే అక్కడ వేస్తున్నారు. దీంతో సమీపంలోని కాలనీల ప్రజలు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. మరి కొన్ని గ్రామాల్లో మురుగు నీరు రోడ్లపై చేరి బురదమయంగా మారుతుంది. ఆ మురుగులో దోమలు, ఈగలు, లార్వాలు వృద్ధి చెంది వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి పారిశుద్ధ్య పనులు ముమ్మరం చేయాలని వారు కోరుతున్నారు.


తడకనపల్లె గ్రామంలో లోపించిన పారిశుద్ధ్యం


చిన్నటేకూరులో రోడ్డుపై మురుగు కుంట

అకాల వర్షం.. అపార నష్టం


గడివేముల గ్రామంలో పట్టలు కప్పకుంటున్న దృశ్యం


పాణ్యం మండలంలో వర్షపు నీటిలో నుంచి వరి ధాన్యం తీసుకుంటున్న రైతు

రైతుల రెక్కల కష్టం వర్షార్పణమైంది. శుక్రవారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి వివిధ పంటలు దెబ్బతిన్నాయి. గడివేముల, పాణ్యం మండలాల్లో కలాల్లో ఆరబోసుకున్న మొక్కజొన్న, వరి, మిరప దిగుబడులు తడిసిముద్దయ్యాయి. అప్పటికప్పుడే వాతారణంలో భారీ మార్పులతో వర్షం కురవడంతో రైతులకు దిక్కుతోచ లేదు. ఆరబోసిన దిగుబడులను పట్టలు కప్పి కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడ్డారు. గడివేముల మండలం పరిధిలోని బిలకలగూడూరు రస్తాలలో పిడుగు పడటంతో గడ్డివాములు దగ్ధమయ్యాయి. పాణ్యం మండలంలో వరి, మిరపతో పాటు ఉద్యాన పంటలకు భారీ నష్టం వాటిల్లింది. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

–పాణ్యం/గడివేముల


బూజునూరు గ్రామసమీపంలో పిడుగుపాటుకు దగ్ధమైన గడ్డివాములు


భూపనపాడులో వర్షానికి తడుస్తున్న మిరప దిగుబడిని కాపాడుకునేందుకు రైతుల అవస్థలు

పాఠశాలలో గాంధీ విగ్రహావిష్కరణ

కర్నూలు (రూరల్): మండల పరిధిలోని పసుపల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ప్రాధానోపాధ్యాయురాలు విజయమ్మ వారి తల్లి సుబ్బలక్ష్మమ్మ జ్ఞాపకార్థం సొంత ఖర్చులతో గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయించారు. విగ్రహాన్ని శుక్రవారం ఆమె అవిష్కరించారు. అమె మాట్లడుతూ విద్యార్థులు గాంధీజీని స్ఫూర్తిగా తీసుకొని, ఆయన అడుగుజాడల్లో నడవాలనే ఉద్దేశంతో విగ్రహాన్ని స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బోగ్గుల సుశీలమ్మ, ఓర్వకల్ ఎంఈఓ ఓంకార్ యాదవ్, గ్రామ పంచాయతీ సెక్రటరీ హేమంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మట్టి నమూనాల సేకరణ

గడివేముల: మండలం పరిధిలోని అన్ని గ్రామాల్లో నేటి నుంచి మట్టి నమూనాలను సేకరించాలని ఏఓ హేమసుందర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. మట్టి సారాన్ని, అందులో లోపాలు పరిశీలించి రైతులకు సలహాలు, సూచనలు అందించాలనే లక్ష్యంతో మట్టి నమూనాలు సేకరిస్తున్నామన్నారు. మండలానికి 697 మట్టి నమూనాలు మే 15వ తేదీలోపల సేకరించాలన్నారు. ఆయా గ్రామాల పరిధిలోని రైతు సేవా కేంద్రం అధికారితో పాటు రైతుల ఆధ్వర్యంలో సేకరించడం జరుగుతుందన్నారు. మట్టి నమూనాల ఫలితాలను 15 రోజుల్లో రైతులకు అందజేస్తామన్నారు. దీంతో రైతులు ఏఏ ఎరువులు ఉపయోగించాలో తెలియజేస్తామన్నారు.